జిల్లా అదనపు వైద్యాధికారిగా రమేష్‌బాబు

బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్: జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారిగా డాక్టర్ రమేష్‌బాబును నియమిస్తూ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీ నరసయ్య ఆదే శాలు జారీ చేశారు. బుధవారం రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. సాదారణ బదిలీల్లో భాగంగా రాయచోటికి బదిలీ అయ్యారు. గతంలో పనిచేస్తున్న అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ తిరుపతికి బదిలీ అయ్యారు. మదనపల్లి డిప్యూటీ డిఎంహెచ్ఒగా, వాల్మీకిపురం టిబి యూనిట్ వైద్యాధికారిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్న రమేష్ బాబుకు అదనంగా జిల్లా అదనపు డిఎంహెచ్ఒ, డిఎల్ఎటిఒ బాధ్యతలను పూర్తి స్థాయిలో ఉన్నత అధికారులు అప్పగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా లోని ప్రోగ్రామ్ ఆఫీసర్స్, మెడికల్ ఆఫీసర్స్, వైద్య ఆరోగ్య సిబ్బంది సహకారంతో జిల్లాను వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఇండికెటర్లలో మొదటి స్థానంలో ఉండేందుకు కృషి చేస్తానని అన్నారు. ఇందుకు అందరూ సహకారం అందించాలని కోరారు. డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీ నరసయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్స్, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, టిబి యూనిట్ల సిబ్బంది డాక్టర్ రమేష్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

కష్టాల్లో.. ఖరీఫ్!

- పదును కోసం ఎదురుచూపు
- కడపలో 2.60, అన్నమయ్యలో 3.57 శాతంలోనే విత్తనం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉభయ జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. 2025-26 జూన్ ప్రారంభానికి ముందే రుతుపవనాలు వచ్చినట్లే వచ్చి మాయంకావడం వంటి అనిశ్చితి పరిస్థితులు నెలకొనడంతో రైతాంగం నిరుత్సాహానికి గురవుతోంది. ఈ ఏడాది జూన్ ముగుస్తున్నప్పటికీ సాగు ఊపందుకోని వైనం ఆందోళన కలిగిస్తోంది. జులైలోనైనా ఆశించిన వర్షపాతం కురుస్తుందనే ఆశాభావంతో రైతాంగం ఎదురుచూస్తోంది. ప్రతి రోజూ సాయంత్రానికి కారు మబ్బులతో ఆశలు రేకెత్తించడం, ఉస్సూరుమనిపించడం పరిపాటిగా మారింది. కడప జిల్లాలో 2.60 శాతం, అన్నమయ్యలో 3.57 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. జులై నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో విత్తనం పడాల్సిన తరుణంలో మేఘాలు ఉస్సూరుమనిపిస్తుండడం ఆందోళన నెలకొంది.

ఉభయ జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ మందగమనంలో సాగుతోంది. కడప జిల్లాలో 1,91,363 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 1,40,797 ఎకరాల సాధారణ విస్తీర్ణంలో పంటలను సాగు చేయాలనేది వ్యవసాయ శాఖల లక్ష్యం. కడప జిల్లాలో జూన్ మాసంలో నుంచి 4,974 ఎకరాల్లోనే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో 2,036 ఎకరాల్లోనే విత్తనం పడింది. గతేడాది కడప జిల్లాలో 8,467 ఎకరాల్లో, అన్నమయ్య జిల్లాలో 4,588 ఎకరాల్లో విత్తనం పడింది. ఈలెక్కన కడప జిల్లాలో 2.60 శాతం, అన్నమయ్య జిల్లాల్లో 3.57 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. ఉభయ జిల్లాల్లో మిగిలిన 97 శాతం పొలమంతా బీడుగా దర్శనమిస్తోంది. ఉభయ జిల్లాల రైతాంగం సిద్ధమైన తరుణంలో మేఘం ముఖం చాటేసింది. పంటల సాగు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కడప జిల్లాలో ప్రధాన పంట వరి 76,085 ఎకరాల సాగుకుగానూ 701.48 ఎకరాలు, వేరుశనగ 14,760 ఎకరాల్లో సాగుకు గానూ 461 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం గమనార్హం. పత్తి 59,368 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 3,544 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో 1.40,797 ఎక రాల్లో పంటల సాగు చేయడం వ్యవసాయశాఖ లక్ష్యం. ఖరీఫ్ సీజన్ మొదలు నుంచి నేటి వరకు 2,036 వేల ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన జిల్లాలో 3.57 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. జిల్లా ప్రధాన పంట వేరుశనగ. జిల్లాలో 93,892 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 3,974 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన 3.97 శాతం విస్తీర్ణంలో విత్తనం పండింది. మిగిలిన పొలమతా బీళ్లుగానే దర్శనమిస్తోంది. ఈ ఏడాది జూన్‌లో వర్షాభావం వెంటాడింది. 68.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 58.28 శాతం కురవాల్సి ఉండగా 18.9 శాతమే నమోదైంది. ఈలెక్కన -63.8 మిల్లీమీటర్ల వర్షపాతం, అన్నమయ్య జిల్లాలో 75.1 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా 24.4 శాతమే కురిసింది. ఈలెక్కన -67.5 శాతం లోటు కొనసాగుతోంది. ఫలితంగా కడప, అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ మందగమనంలో సాగుతోంది. కడప జిల్లాలో 36 మండలాలు ఉన్నాయి. ఇందులో ఏఒక్క మం డలంలోనూ సాధారణ వర్షపాతం నమోదు గాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా పంటల సాగు నత్తకనడకన సాగుతోంది. అన్నమయ్య జిల్లాలో 30 మండలాలు ఉన్నాయి. ఇందులో ఒక్క మండలంలోనే సాధారణ వర్షపాతం నమోదైంది. మిగిలిన 29 మండలాల్లో ఎనిమిది మండలాల్లో లోటు వర్షాభావం నమోదు కాగా, మరో 20 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నిరాశాజక పరిస్థితులు నెలకొనడం విస్మయాన్ని కలిగిస్తోంది.

సాగు కోసం పొలం దుక్కులు చేస్తున్న రైతులు

అనధికార వడ్డీ వ్యాపారులపై చర్యలు

- గౌరీని వేధించిన మాజీ సైనికుడిపై కేసు నమోదు చేయాలి
- మహిళలకు రక్షణ కల్పించాలి
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి డిమాండ్

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో విచ్చలవిడిగా తయారైన అనధికార వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని, వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో ఇరుక్కున్న మహిళలకు రక్షణ కల్పించాలని అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి రమాదేవి డిమాండ్ చేశారు. మదనపల్లెలో గౌరీ అనే బాధితురాలు వడ్డీ వ్యాపారస్థుడైన మాజీ సైనికుడు ఏకాంబరరెడ్డి వేధింపులకు తట్టుకోలేక మంగళ వారం మీడియా ముందుకు వచ్చి తన బాధను వెళ్లగక్కి తనకు చావే శరణ్యమని బోరున విలపించడంతో రమాదేవి స్పందించారు. బుధవారం మదనపల్లెకు చేరుకున్న రమాదేవి బాధితురాలు గౌరీ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆమెకు జరిగిన అన్యాయంపై ఆరా తీశారు. అనంతరం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బాధితురాలు గౌరీతో పాటు ఐద్వా రాష్ట్ర, జిల్లా నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఆర్థిక అవసరత ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్న కొంతమంది వడ్డీ వ్యాపారస్తులు వారికి అధిక వడ్డీకి అప్పులు ఇస్తూ, వారి వద్ద నుంచి అసలు కన్నా వడ్డీలను 10 రెట్లు ఎక్కువగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. మదనపల్లెలో గౌరీ అనే మహిళకు స్థానికంగా ఉంటున్న మాజీ సైనికుడు ఏకాంబరరెడ్డి, ఆదివేని ఆనంద్, అతని భార్య మంజుల, బండి హరినాథ్ తక్కువ మొత్తంలో డబ్బులు ఇచ్చినప్పటికీ ఎక్కువ మొత్తంలో ఇవ్వాలని వేధింపులకు గురిచేయటం బాధాకరమన్నారు. అసలు తీర్చేసినా ఇంకా డబ్బులు ఇవ్వాలని వేదించడం, డబ్బులు కట్టలేని పక్షంలో వ్యభిచారం చేసి మా డబ్బులు చెల్లించమని పురిగొల్పడం, అనుమానించడం, అంతు చూస్తామని బెదిరించడం విచారకరమన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నిందితులకు మరింత ఊతమిచ్చినట్లు అయ్యిందన్నారు. బాధితురాలు మీడియా ముందుకు వచ్చి తన జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ గోడును వెల్లబోసుకుందన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం ఏమి చేస్తోందని నిలదీశారు. ఇక మహిళలకు రక్షణ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. మైక్రో సంస్థలు అసగడాలు మితిమీరుతున్నాయని, మహిళల్నే టార్గెట్ చేస్తూ మళ్లీ జూలు విదుల్చుతోందన్నారు. కొంతమంది వడ్డీ వ్యాపారస్తులు రూ.వెయ్యికి రూ.వెయ్యి వడ్డీ వసూలు చేస్తున్నారని, లైసెన్స్ లేకుండా వడ్డీ వ్యాపారాలు చేస్తున్నారని, ఆర్‌బిఐ నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారాలు నడుస్తున్నాయన్నా, అధికారులు నిమ్మకనీరేత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి మహిళలకు రక్షణగా నిలవాలన్నారు. మదనపల్లెలో జరిగిన అరాచకంపై సబ్ కలెక్టర్ స్పందించి సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వడ్డీ వ్యాపారాలపై జరుగుతున్న అక్రమాలను అరికట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలు గౌరీ వద్ద ఉన్న ఆధారాలను తీసుకొని వాటిపై సమగ్ర విచారణ జరిపి అంతంత పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చారా, వారికి ఎక్కడి నుంచి ఆ డబ్బులు వచ్చాయి, అన్న కోణంలో సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. ముఖ్యంగా మైక్రో సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి ఐద్వా అండగా ఉంటుందని, ఆమెకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని తెలిపారు. ఇలాంటి బాధితులు ముందుకు రావాల్సిన అవసరత ఉందని పేర్కొన్నారు. సమావేశంలో బాధితురాలు గౌరీ, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా ఇన్‌ఛార్జి సాయిలక్ష్మి, అన్నమయ్య జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, చిత్తూరు జిల్లా కన్వీనర్ భువనేశ్వరి, మదనపల్లె పట్టణ కమిటీ సభ్యులు రెడ్డి ప్రసన్న, షాహినా పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్

సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విఆర్‌ఎల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి ఏడాది గడిచినా విఆర్‌ఎల సమస్య ఏఒక్కటీ పరిష్కారం చేయ లేదన్నారు. ఎన్నికల ముందు సమస్యలు పరిష్కారిస్తామని చెప్పి ఏడాదైనా గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. గ్రామ రెవెన్యూ సహాయలకు ఎనిమిదేళ్లుగా జీతాలు పెరగలేదన్నారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి రూ.18 వేలు పెంచుతానని ఒక్క రూపాయి పెంచలేదన్నారు. తెలంగాణలో విఆర్‌ఎలకు పేస్కేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మన రాష్ట్రంలో కూడా విఆర్‌ఎలకు పేస్కేల్ అమలు చేయాలని మంత్రులు, అధికారులు చుట్టూ ప్రదక్షణాలు చేస్తున్నా కనికరించడంలేదన్నారు. చదువుకున్న విఆర్‌ఎలు ఎప్పటికైనా విఆర్‌ఒ ప్రమోషన్ వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం మాత్రం ప్రమోషన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. నామినీలుగాగా పనిచేస్తున్న వారిని విఆర్‌ఎలుగా గుర్తించాలన్నారు. ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న విఆర్‌ఎలకు వయోభారం పెరుగుతుందని, దళిత, గిరిజన, మైనార్టీ, బడుగు బలహీన వర్గాలకు విఆర్‌ఎల కుటుంబాలను ఆకలి బాధల నుండి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా విఆర్‌ఎలకు పేస్కేలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటెండర్, నైట్ వాచ్‌మెన్, డ్రైవర్లు, ప్రమోషన్ల శాతాన్ని 20 నుండి 70 శాతంకు పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దుచేసి, అర్హులైన విఆర్‌ఎలకు అటెండర్ నైట్ వాచ్‌మెన్‌గా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేల్ రవికుమార్ మాట్లాడుతూ కనీస వేతనం, అమలు చేయకుండా, గౌరవ వేతనం పేరుతో రూ.10,500తో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు, తల్లికి వందనం, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఇంటి స్థలం, భూములు, ఇవ్వాలని జిఒ ఉన్నా అమలు చేయడం లేదన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పనిని 10 గంటలకు పెంచడం, కార్మిక వ్యతిరేకమన్నారు. జూలై 9న సార్వత్రిక సమ్మె చేయాలని పిలుపునిచ్చారు. సబ్ కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీధర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పంది కాళ్ళ మణి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మధు, కొరముట్ల సుధాకర్, నాయకులు కలిశెట్టి లక్ష్మీకర్, కుమార్, బత్తిన సుబ్రమణ్యం, బి.నాగరాజు, బలరాం, ప్రసాద్, రాంప్రసాద్, సుబ్రహ్మణ్యం, లావణ్య, వెంకటసుబ్బయ్య, శివయ్య, హరి, శ్రీను, వెంకటయ్య, సుబ్బరాయుడు, చక్రపాణి, వెంకటరమణ, కరీముల్లా, సుమలత, నరసింహులు, రమణయ్య, రత్న, నరసింహులు, హరీష్, శ్రీను, పెంచల ప్రసాద్ పాల్గొన్నారు.

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించండి : సిపిఎం

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రపంచంపై అమెరికా ఆదిపత్య ధోరణిని వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు అన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలోని అంబేద్కర్ చిత్రపటం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా ప్రపంచ దేశాలకు పెద్దన్న పాత్ర పోషిస్తున్నట్లు అనుచిత వ్యాఖ్యలు చేస్తూ , మిలిటరీ ఆయుధాల వ్యాపార లాభాల విస్తరణకు పాల్పడుతుందని అన్నారు. దేశాల మధ్య జరిగే యుద్ధాలకు ఆజ్యం పోస్తూ పెద్ద ఎత్తున ఆయిల్ గ్యాస్ గనులు దోచుకుంటూ ప్రపంచ పోలీస్ అవతారం ప్రదర్శన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు టెర్రరిస్టు దేశంగా ఐక్యరాజ్యసమితిచే పిలవబడుతున్న ఇజ్రాయిల్ అమెరికా మద్దతుతో పాలస్తీనా, ఇరాన్ పైన ఏకపక్ష యుద్ధం చేయటఃడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించిందని తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాద వైఖరితో ఇజ్రాయులకు మద్దతుగా ఇరాన్ పై ప్రత్యక్ష యుద్ధానికి దిగడం అంతర్జాతీయ న్యాయ చట్టాలకు పూర్తిగా విరుద్ధమైన వైఖరిని వారు విమర్శించారు. పాలస్తీనా, ఇరాన్‌లో మారణహోమం చేస్తున్న ఇజ్రాయిల్ ను అమెరికా బలపరచడం అప్రజాస్వామిక చర్య అన్నారు. అమెరికా సామ్రాజ్యవాదాన్ని నిరసిస్తూ, ఇజ్రాయిల్ మరణ హోమాన్ని ఆపాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని, అంతర్జాతీయ న్యాయ చట్టాలు కాపాడాలని, సామ్రాజ్యవాదం నశించాలని నిరసన తెలిపామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగబసిరెడ్డి, మాధవయ్య, సిఐటియు యకులు రమేష్, జనార్దన్, కోటయ్య, సభ్యులు పాల్గొన్నారు.

బాలసుబ్రమణ్యంకు కండువావేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

వైసిపిలో చేరిన సుగవాసి బాలసుబ్రమణ్యం

-కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన వై.ఎస్.జగన్

ప్రజాశక్తి-రాయచోటి : తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, రాజంపేట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం బుధవారం వైసిపిలో చేరారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో సుబ్రమణ్యానికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, హిందూపురం పరిశీలకులు రెడ్డెప్పగారి రమేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, మేయర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే రఘు రామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.సతీష్‌రెడ్డి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, పుంగనూరు నేత శ్రీనాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పార్టీ తరఫున సుగవాసి సుబ్రమణ్యంకు సముచిత గుర్తింపు, స్థానం లభిస్తుందని నేతలు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి అంటే సామాన్యుని పార్టీ కుల, మత, ప్రాంత వివక్షలకు అతీతంగా అన్ని వర్గాలను గౌరవించే పార్టీ అని అన్నారు. ఇందులో సీనియర్ నేతలకు గౌరవం ఉంటుంది, అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని అన్నారు. సుబ్రమణ్యం లాంటి నేతల చేరికతో పార్టీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. సుగవాసి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల పక్షాన పోరాడుతున్న వైఎస్ జగన్ నేతృత్వంపై నాకు విశ్వాసం ఉందని అన్నారు. ప్రజల కోసం పనిచేసేలా, పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానున్నారు. నాకు ఇక్కడ గౌరవం, అవకాశాలు ఉంటాయని నమ్మకం ఉందన్నారు.

పిఎం సూర్యఘర్ పథకంపై అవగాహన

ప్రజాశక్తి-పీలేరు: పిఎం సూర్యఘర్ పథకంపై పీలేరు డివిజన్ పరిధిలో పది వేల మందికి అవగాహన కల్పిస్తున్నట్లు పీలేరు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పీలేరు సిఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కళాశాల డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పిఎం సూర్య ఘర్ పథకం పట్ల అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి వినియోగదారులు ఎలాంటి లబ్ధి పొందవచ్చనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు. రెండవ సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి విద్యార్థి సుమారు 60మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు అందించి, ఈ పథకంపై పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థుల ద్వారా ఈ పథకాన్ని విస్తృత స్థాయి ప్రచారాన్ని కల్పించేందుకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఇలు ఖాదర్ ఇలాహీ, రామ్మూర్తి, డివిఎంసి సభ్యులు బోధిషావలి, విద్యుత్ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి సిసి రోడ్లు : మంత్రి

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్రతి గ్రామానికి సిసి రోడ్డు ఏర్పాటు చేస్తామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్ర సాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలో గల కమ్మపల్లె నుంచి చిన్నర్సుపల్లె వరకు నూతన రోడ్డు నిర్మించేందుకు బుధవారం మంత్రి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నమండెం మండలం, గతంలో అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాయచోటి నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం ఈ ఆరు మండలాలలో సిమెంట్ రోడ్లు నిర్మించి గ్రామాలను అభివృద్ధి చేస్తామని అన్నారు. రాబోయే రోజులలో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

అన్ని శాఖల సమన్వయంతోనే రాష్ట్ర ఆదాయం పెంపు సాధ్యమని పన్నుల పరిధిలోకి రాకుండా తప్పించుకునే వారిని పన్నుల పరిధిలోకి తీసుకురావడానికి అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర జిఎస్‌టి ఆదాయంపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి జిఎస్‌టి అధికారి, జిల్లా పంచాయతీ శాఖ మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లు ఆడిట్ శాఖ తదితర శాఖల వారు జిఎస్టి ఆదాయాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమయ్యే ఆదాయాన్ని పన్నుల ద్వారా సమీకరిస్తుందన్నారు. రాష్ట్ర జిఎస్‌టి ఆదాయాన్ని పెంచడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిఎస్‌టి శాఖ వారికి అవసరమైన వివరాలను ఇతర శాఖల అధికారులు చట్టపరిధికి లోబడి ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘా స్వరూప్, నైదియా దేవి, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, జిల్లా జిఎస్‌టి శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

అప్రకటిత ఎమర్జెన్సీని ఎదిరించండి

- సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జూన్ 25 నాటికి సరిగ్గా 50 ఏళ్ల క్రితం దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించబడిందని, అర్ధరాత్రి దేశంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు 1,13,000 మందిని ప్రభుత్వం అరెస్టు చేసినట్లు పత్రికల్లో వార్తలొచ్చాయని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు బుధవారం శ్రీనివాసులు మాట్లాడుతూ ఆనాడు కార్మిక ఉద్యమాలు, కమ్యూనిస్టులు, నికరంగా నిలబడి ఎమర్జెన్సీని ఎదిరించి పోరాడిన తీరుతో ఎమర్జెన్సీ ఎత్తేయక తప్పలేదన్నారు. ఎమర్జెన్సీ రాజ్యాంగంపై నల్లని మచ్చ, రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో తాము ముందున్నట్లుగా నరేంద్ర మోడీ ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. జాతీయోద్యమంలో ఏ రకమైన పాత్ర లేని ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదులు చరిత్రను తిరగ రాసే ప్రయత్నాలను చేస్తున్నారని అన్నారు. ఎమర్జెన్సీలో తమ పాత్రను తిరగరాయడానికి ప్రయత్నించడంలో భాగమే మోడీ చిలుక పలుకులు అన్నారు. 50 ఏళ్ల అనంతరం ఎమర్జెన్సీ చీకటి పాలన గుర్తు చేసుకుంటే, అంతకంటే మరింత ప్రమాదకరమైన పరిస్థితి నేడు కార్పొరేట్ మతోన్మాద బిజెపి పాలనలో ప్రజలు నిర్బంధాన్ని చవిచూడాల్సి వస్తోందని అన్నారు. బ్రిటీష్ పాలనలో రాజద్రోహ నేరం కింద మూడేళ్ళ కంటే ఎక్కువ కాలం విచారణ లేకుండా నిర్బంధించడానికి వీలు లేదన్నారు. కానీ నేడు బిజెపి పాలనలో పదేళ్ళకు పైగా విచారణ లేకుండా నిర్బంధించే పరిస్థితి దాపురించిందన్నారు. మత విద్వేషాన్ని రెచ్చగొట్టి దేశ సమైఖ్యత విశ్వాసాన్ని దెబ్బ తీస్తోందన్నారు. గో సంరక్షణ పేరుతో ఆర్‌ఎస్‌ఎస్ మూక దాడులు పేట్రేగి పోతున్నాయని, ప్రెసిడెన్సియల్ రిఫరెన్స్ పేరుతో సుప్రీంకోర్టు స్వతంత్రతను నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉన్నా రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని మార్చకూడదని రాజ్యాంగం పేర్కొందని అన్నారు. బిజెపి పాలకులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1926 బ్రిటీషు కాలంలో పోరాడి సాధించుకున్న సంఘం పెట్టుకోవడం, యజమానితో బేరసారాలు ఆడటం, ఆఖరికి సమ్మెకు సిద్ధం కావటం అనే కార్మికుల చట్టాలను, లేబర్ కోడ్‌ల పేరుతో అత్యంత నిరంకుశంగా రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశం అన్న భావననే విషపూరితం చేసి, హిందూత్వాన్న చొప్పిస్తోందన్నారు. దళితులు, గిరిజనులు మనువాద భావజాలం కింద నలిగిపోతున్నారని వివరించారు. మతోన్మాద బిజెపి దుష్ట పాలనను తిప్పికొట్టడమే 50 యేళ్ల ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం మనకిచ్చే స్ఫూర్తి అని తెలిపారు.

హజ్ యాత్రికులకు ఎమ్మెల్యే స్వాగతం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముస్లిం మైనార్టీలకు ఎంతో పవిత్రమైన హజ్ యాత్రను దిగ్విజయంగా ముగించుకుని హాజీలు తిరిగి బుధవారం తెల్లవారు జామున బెంగళూరు ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా హాజీలకు మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఘనస్వాగతం పలికి వారికి ప్రత్యేకంగా విందును ఏర్పాటు చేశారు. హజ్ యాత్ర శుభప్రదంగా ముగిసిందని హాజీలు తెలిపారు. భవిష్యత్తులో హజ్ యాత్రకు మరింత విస్తృత మైన ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాసన్ బాషా, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్ ఖాన్, మెంబర్లు పాల్గొన్నారు.

అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

36 జిఒ అమలు చేయాలి

- మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల అర్ధ నగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు 36 జిఒ అమలు చేయాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, శంకరయ్య మాట్లాడుతూ పని గంటలు పెంచి కేవలం రూ.15వేలు వేతనం ఇస్తున్నారని, పారిశుధ్య కార్మికులతో పాటు రూ.21 వేలు వేతనం ఇవ్వాల న్నారు. వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచి ఆప్కాస్ కొనసాగించాలని లేనిపక్షంలో పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమపథకాలు అమలుచేయాలని, రక్షణ పరికరాలతో పాటు నాణ్యమైన పనిముట్లు సరఫరా చేయాలన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయక పోవడాన్ని కార్మికులను దగా చేయడమేనన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఆప్కాస్ కొనసాగించి, ప్రయివేట్ ఏజెన్సీలకిచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన చెందారు. నీటి కొరత నివారణకు పాలక అధికార యంత్రాంగం చర్యలు చేపట్టి ప్రజల ఆక్రోశం నుంచి కాపాడాలని తెలిపారు. మున్సిపల్ కార్మికుల ధర్నాకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, వైసిపి కౌన్సిలర్లు పయాజ్ బాషా, సలీం మద్దతు తెలుపుతూ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల సాధన పోరాటానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికులు దేవా, రమేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి,మౌనిక, రమణ, షకీల్ పాల్గొన్నారు.

'అన్నమాచార్య' అధ్యాపకుడికి డాక్టరేట్

మధును అభినందిస్తున్న గంగిరెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : అన్నమాచార్య ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు ఎం.మధుకు ఇటీవల జెఎన్‌టియు అనంతపురం విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేసినట్టు కళాశాల కార్యదర్శి డాక్టర్ సి.గంగిరెడ్డి తెలిపారు. మధు సుమారు 15 సంవత్సరాల నుంచి ఫార్మసీ కళాశాలలో ఫార్మాస్యూటికల్ అనాలసిస్ విభాగంలో వివిధ రకాల స్థాయి నుంచి ప్రస్తుతం హెచ్ఒడిగా సేవలందిస్తున్నారని అన్నారు. వీరు తన పిహెచ్‌డి పరిశోధన "డెవలప్మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ యు.పి.ఎల్.సి మెథడ్స్ ఫర్ క్వాంటిటేటివ్ ఎస్టిమేషన్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ ఇన్ బల్క్ అండ్ డోసేజ్ ఫార్మ్స్' అనే అంశంపై పరిశోధన నిర్వహించి ఈ డాక్టరేట్ అర్హతను పొందారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. కళాశాల వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి, కోశాధికారి సి.అభిషేక్ రెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్ర రెడ్డి డాక్టరేట్ పొందినందుకు మధు ను ప్రశంసించారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న జెఇఒ వీరబ్రహ్మం

సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మం

ప్రజాశక్తి-నందలూరు

టిటిడి అనుబంధంగా ఉన్న శ్రీసౌమ్యనాథస్వామి ఆలయంలో జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మం ఆదేశించారు. అధికారులతో కలిసి ఆయన ఉత్సవాల ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు.శ్రీ సౌమ్యనాథ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు జూలై 8న ఉదయం 10.30 నుంచి 1 గంటల వరకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు వాహనసేవలు జరుగుతాయి. వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తుల సౌకర్యార్థం విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. వాహన సేవలో సమయ పాలన పాటించాలని కోరారు. ఆలయ పరిసరాలలో ప్రతి రోజూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు దర్శనం, తాగునీరు, ప్రసాదాల పంపిణీలో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. భక్తులు ఆకట్టుకునేలా విద్యుత్, పుష్ప అలంకరణలు చేపట్టాలన్నారు. కల్యాణోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వాహన సేవలో భక్తులను ఆకట్టుకునేలా కళాబృందాలను ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఆదేశించారు. టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతి రోజూ హరికథలు, ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఇలు వేంకటేశ్వర్లు, మనోహరం, డిప్యూటీ ఈవోలు నటేష్ బాబు, శివప్రసాద్, ప్రశాంతి, డిఎఫ్వో ఫణికుమార్ నాయుడు, పట్టణీకరణ నిపుణులు శ్రీ రాముడు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

పండ్ల తోటల పెంపకానికి ఆసక్తిగల రైతులు ఈనెలాఖరులోగా దరఖాస్తులు చేసుకోవచ్చని ఎపిఒ పెంచలయ్య పేర్కొన్నారు. మండలంలో బుధవారం గువ్వలచెరువు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులలో పూడిక తీతపనులను, నీలకంఠరావుపేట గ్రామంలో కాలువ పూడిక తీత పనులను ఇసి ఓబులేసుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచాలని, రైతులు తమ పొలాల వద్ద ఫారంపాండ్ తీసుకోవడం వల్ల నీటినిలువకు ఎంత ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. 190 ఎకరాల పండ్ల తోటలు గుర్తించామని ఇంకా ఆసక్తిగల రైతులు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో నీలకంఠరావుపేట, గువ్వలచెరువు, టెక్నికల్ అసిస్టెంట్స్ శివయ్య సతీష్కుమార్రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పెంచల్ రెడ్డి, రియాజ్ , కూలీలు పాల్గొన్నారు

నేడు శ్రీనేలమల్లేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని తవళం గ్రామంలోని శ్రీ నేలమల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఉన్న హుండీలను గురువారం లెక్కిస్తున్నట్లు ఆలయ ఇఒ మంజుల తెలిపారు. ఉదయం 10 గంటలకు దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కిస్తున్నట్లు చెప్పారు. ఆలయ నిర్వాహకులు, ఆశక్తి గల భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చునని తెలిపారు.

గురుకులంలో మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-రామపురం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి కడప, అన్నమయ్య జిల్లాలలో మిగిలిన 6,7,8,9 తరగతులలో సీట్లకు రామాపురం బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. రెండు జిల్లాల నుంచి 1242 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా పరీక్షకు1035 హాజరైనట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు.

ప్రమాద బీమాతో బాధిత కుటుంబాల్లో వెలుగులు

- బాధితురాలికి రూ.10 లక్షలు చెక్కు అందజేత

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్కరూ ప్రమాదబీమా చేయించుకోవడం వలన భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ చైతన్య అన్నారు. మండలంలోని బోయపల్లికి చెందిన లక్ష్మీదేవి కుమారుడు మహేష్ బాబు ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. మహేష్ బాబు రూ.500లతో ప్రమాదభీమా చేయించుకొని, తల్లి లక్ష్మీదేవిని నామినిగా ఉంచాడు. దీంతో బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ చైతన్య, చీఫ్ మేనేజర్ సురేంద్ర చేతులమీదుగా రూ.10లక్షల చెక్కును బాధితురాలు లక్ష్మీదేవికి అందించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రూ.500తో ప్రమాదబీమా చేయించుకోవడం వలన అనుకోని పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే ఆ నామినీకి రూ.10లక్షలు అందించడం జరుగుతుందన్నారు. వారి కుటుంబం ఆర్థికంగా ఎదుగేందుకు సహాయపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రమాద బీమాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది శరత్, విశ్వ, ఎపిఎం నరోత్తమరెడ్డి పాల్గొన్నారు.

గుమ్మసముద్రంలో గ్రామసభ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని గుమ్మసముద్రం సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ ప్రజలపై దాడి చేసిన విషయం తెలిసిందే.గుమ్మసముద్రం సచివాలయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రికార్డులు తారుమారు చేశారని, అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజలు కలెక్టర్కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు.ఈ గ్రామసభ కార్యక్ర మంలో సబ్ డివిజన్ జాయింట్ ఖాతాలో పిఎం సిట్టింగ్ 110 అర్జీలు వచ్చాయని, రెవె న్యూ అర్జీలు 30 దాకా వచ్చాయని తహశీల్దార్ ఎ.బావాజాన్ తెలిపారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామస్తులు అందించిన అర్జీలను పరిశీలించి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రీసర్వే డిటి బాలాజీ, విఆర్ఒ మల్లికార్జున, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రకోటపల్లి వైద్యాధికారిగా ఇస్మాయిల్

ప్రజాశక్తి-కలకడ

ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా ఇస్మాయిల్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ ఎం.వి. కిషోర్కుమార్రెడ్డి బదిలీపై తిరుపతి మెడికల్ కాలేజీకి వెళ్లడంతో డాక్టర్ స్థానం ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో పెద్దమండెం మండలంలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఇస్మాయిల్, మండ లంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తానని తెలిపారు. ఇందుకోసం వైద్య సిబ్బంది తనకు సహకరించాలని కోరారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ ఇస్మాయిల్

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు

- భయాందోళనకు గురవుతున్న విద్యార్థులు
- తొలగించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణంలోని కోనేటివీధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న విద్యుత్ పోల్కు తీగలు అల్లుకుపోవడంతో భయభ్రాంతులకు గురవుతున్నామని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇక్కడ నివశిస్తున్న వీధి వాసులు వాపోతున్నారు. పక్కనే పాఠశాల ఉండడంతో ఎవరైనా విద్యార్థులు విద్యుత్ పోల్, పిచ్చిమొక్కలు, పోల్కు చుట్టుకున్న తీగలను పట్టుకుంటే విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని ఇక్కడ నివాసులు ఆరోపిస్తున్నారు. పోల్ ఎత్తుకు పిచ్చిమొక్కలు, తీగలు పెరిగినా విద్యుత్ శాఖ అధికారులు గానీ, పంచాయతీ అధికారులు గానీ ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు మండిపడుతున్నారు. విద్యుత్ పోల్ ఎత్తుకు తీగలు పెరిగేందుకు చాలా సమయం పడుతుందని, అయితే అధికారులు వస్తారు, వెళ్తారే కానీ వీధుల్లో ఎక్కడ ఏ సమస్య ఉందని తెలుసుకొని, పరిష్కరించే అధికారి లేరని ప్రజలు మండిపడుతున్నారు. సమస్యను చూసి చూడనట్లు వెళ్లిపోతారని, ఎవరైనా చెప్పినా సమస్య పరిష్కారానికి రోజులు గడుపుతారే తప్ప సమస్య మాత్రం పరిష్కారం కాదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు, పిచ్చిమొక్కలు

బదిలీపై వెళుతున్న గురువులకు సన్మానం

పీలేరు : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహోపాధ్యాయులు

ప్రజాశక్తి-పీలేరు

స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేసి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సహ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి సత్కరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలోని జంగంపల్లి జడ్పి హైస్కూల్లో బయాలజికల్ సైన్స్ టీచర్ వి. రేణుక, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు బి.వెంకటరమణ స్కూల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహించి బదిలీపై పీలేరు మండలంలోని వేర్వేరు పాఠశాలలకు వెళ్లారు. బుధవారం వీరిని మండలం లోని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటిపర్తి గంగాధరం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా హెచ్ఎం గంగాధరం మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇరువురు కూడా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి, 10 వతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షరీఫ్, రామమూర్తి, రమణయ్య, ఆనందరాజు, అశోక్, ఫారూక్, లక్ష్మిదేవి, సురేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.**కలికిరి:** విద్యార్థుల భవిష్యత్తే ప్రధాన లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేస్తారని ప్రభుత్వ ప్రాథమి కోన్నత పాఠశాల పూర్వప్రధానోపాధ్యాయులు శారద అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథ మికోన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ విజి నటరాజన్ ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఎం.శాంద, లోకేశరమ్మ, ఖాదర్ వలీ, కుమారి భారతి, పల్లవి, పిటి మాస్టర్ ఆర్గు మంతిలక్ను శాలువాతో సన్మానించారు. అనంతరం శారద మాట్లా డుతూ విద్యార్థులు బాగా చదివి స్కూలుకు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తేవా లని ఆశించి వారు మెరుగైన భవిష్యత్తు కొరకు మా వంతు కృషి చేశామని అన్నారు. పాఠశాలను నాడు-నేడు కార్యక్రమ క్రింద ఎంతో అభివృద్ధి ఇవ్వడం జరిగిందని అన్నారు. ప్రధానోపా ధ్యాయుడు నటరాజన్ మాట్లాడుతూ బదిలీ ఉద్యోగాలు బదిలీపై వెళ్లడం సర్వసాధా రణమే అని ఎక్కడున్నా విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలికిరి: సన్మానం పొందిన బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు

మాదక ద్రవ్యాలు వద్దు..ఆరోగ్యమే ముద్దు

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక చారిత్రాత్మక బెసెంట్ దివ్యజ్ఞాన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాసా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ద్యార్థి ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు.కళాశాల ఎన్సిసి సిటిఒ డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఎంఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.శైలజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఆనందరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం అనేక అనర్థాలకు దారితీస్తుందని ,అందువలన విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీదేవి, డిగ్రీ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.రాఘవరెడ్డి,కళాశాల అధ్యాపకులు, డాక్టర్ డి.శ్రీనివాసులు తదితరులు విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని, జీవితా న్ని నాశనం చేస్తుందని వివరించారు. విద్యార్థులు వాటి వినియోగానికి దూరంగా ఉండాలని ఉద్బోధించారు. అనంతరం మాదకద్రవ్యాలు వద్దు-ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ కళాశాల విద్యార్థులు పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

29న బిసిల ఆత్మీయ సమావేశం

-బిసిహెచ్ పిఎస్ అధ్యక్షులు బోడెం రాజశేఖర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 29న మార్కెట్ యార్డ్ మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం నుంచి శ్రీకృష్ణ కల్యాణ మండపం వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు బిసి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బోడెం రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక శ్రీకృష్ణ కల్యాణ మండపంలో బిసిల ఆత్మీయ సమావేశం జరుగుతుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డిఎ కూటమి గెలుపునకు బిసి హక్కుల పోరాట సమితి మద్దతిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం బిసిలకు ఇచ్చిన వాగ్దానాలు ఎంత మేర అమల్లోకి వచ్చాయో, ఇంకనూ అమలు చేయాల్సిన హామీలు, బీసీలు సాధించుకోవాల్సిన డిమాండ్లు తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి మదనపల్లె, జిల్లా నలువైపుల నుంచి బిసిలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా భవిష్యత్తు కార్యాచరణపైన సమీక్ష జరుగుతుందని తెలిపారు. బిసి హక్కుల పోరాట సమితి ఆవిర్భవించి 17 ఏళ్లు అవుతోందని, ఇప్పటి వరకు తనతో కలసి ప్రయాణం చేస్తున్న కుటుంబ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. బిసి హక్కుల పోరాట సమితి బిసిల భవిష్యత్తుకే పరిమితం కాకుండా ప్రజాపయోగ కార్యక్రమాలను చేపట్టే విధంగా ముందడుగు వేయనున్నామని స్పష్టం చేశారు. మదనపల్లెలో ప్రయివేట్ ఆసుపత్రులు రోగులను దోచుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాగే జిల్లా ప్రభుత్వ బోధనా ఆసుపత్రిలో పేదలకు వైద్యం అందడం లేదని ఈ విషయంపై క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను ప్రజలు ముందు ఉంచుతామని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవలపై ఎమ్మెల్యే స్పందించి పేదలకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించకుండా దొడ్డి దారిలో అమలు చేసే పనులకు స్వస్తి పలకలన్నారు. కార్యక్రమంలో సి.రామలింగయ్య, చిన్నరెడ్డప్ప, కరమత్బాషా, సుబ్రహ్మణ్యం, రామాం జనేయులు, రామకృష్ణ, అమరనాథ్, సుబ్బరాజు, నాగేంద్ర, రాజా, నారాయణస్వామి, ఆర్.సహదేవ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజశేఖర్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య :'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు ఇన్ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. పట్టణంలోని మన్నూరు జడ్పి హైస్కూల్లో బుధవారం ప్రధానోపాధ్యాయురాలు పి.పరిమళ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సర్వేపల్లి విద్యామిత్ర కిట్లు పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీనివాసరాజు పాల్గొని విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఫలితాలు సాధిస్తున్నాయని అన్నారు. ఇటీవల పదవతరగతి ఫలితాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాఠశాలలకు కావలసిన అన్ని వసతులను సమకూరుస్తుందని, సర్వేపల్లి విద్యామిత్ర కార్యక్రమానికి సర్వేపల్లి రాధాకృష్ణ పేరు పెట్టడం ద్వారా రాజకీయాలకు అతీతంగా దేశనాయకులను గౌరవించుకోవడం ప్రభుత్వం లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్, విద్యాశాఖా మంత్రి లోకేష్ చూపిస్తున్న చొరవతో అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించడం ద్వారా పిల్లల్లో మెరుగైన ఆలోచనలు కలుగజేసే విధంగా ఈ కార్యక్రమం ఉందని అన్నారు. విద్యార్థులు విద్యాకిట్ను చక్కగా వినియోగించుకొని విద్యాభివృద్ధి చెందాలని అకాంక్షించారు. కూటమి పాలన విద్యారంగానికి అధిక ప్రాధానతను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ అనుమలగుండం నాగరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, పట్టణ నాయకులు మావిళ్ళ రవి, జనసేన మండల నాయకులు కోలాటం హరికృష్ణ , మన్నూరు నీటి సంఘం అధ్యక్షులు నారదాసు రామచంద్ర, ఊటుకూరు పంచాయతీ నాయకులు పడకాల సుధాకర్ రాయల్, మామిళ్ల మల్లి, నారామణి, తోట బుజ్జి, వజ్రా నరసింహులు, నారదాసు మధు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం బిసి కాలనీలో ఇంటింటికి తిరిగి 1వ తరగతిలో ప్రవేశాలు కల్పించడం జరుగుతోందన్నారు. ఒఎస్సి గాయత్రి, గంగోత్రి అనే బడి బయట పిల్లలను గుర్తించి బీసీ కాలనీలోని ఎంపీపీఎస్ ప్రవేశాలు కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తోందన్నారు. పుస్తకాలు, బ్యాగులు ఉచితంగా అందజేసి మధ్యాహ్నం భోజనం పథకం అమలు చేస్తుందని అన్నారు. ఇప్పటికే తల్లికి వందనం పథకం నిధులు ఖాతాల్లోకి జమచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ రెడ్డిశేఖర్, హెచ్శ్రీం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె : రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని ఎస్ఐ ఉమామహేశ్వర్ రెడ్డి వాహనదారులకు సూచించారు. బుధవారం సాయంత్రం తంబళ్లపల్లె-మదనపల్లె రహదారిలో కురవపల్లె బస్టాప్ వద్ద సిబ్బందితో కలసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల రికార్డులు తనిఖీ చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు వారికి వివరించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపకూడదన్నారు. ద్విచక్రవాహనంపైముగ్గురు వెళ్లకూడదని, తల్లితండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని కోరారు. హెల్మెట్, లైసెన్స్ లేకుండా బండి - నడపడం. ట్రిపుల్ రైడింగ్ వంటి రూల్స్ పాటించని పలువురు వాహనదారులకు జరిమానాలు విధించారు. తనిఖీలలో ఎఎస్ఐ నరసింహులు, పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేడు మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ

- ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలో యాంటీ డ్రగ్స్ అబ్యూస్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎస్పి విద్యాసాగర్ నాయుడు తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో, యువతలో అవగాహన కల్పించడానికి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో మాదక ద్రవ్యాల నివారణకు వాటి నుంచి యువతను దూరంగా ఉంచడానికి ఉద్దేశించి ఒక ముఖ్యమైన సామాజిక చొరవతో ప్రజల్లో చైతన్యం నింపడమే లక్ష్యమన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థ భాగస్వామ్యంతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాల్గొంటారని తెలిపారు.అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాయచోటి పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపు ఉన్నట్లు ఎస్పి అన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు పట్టణంలోకి ప్రవేశించరాదని, పట్టణం నుంచి బయటికి వెళ్లాలన్న గాలివీడు రింగ్ రోడ్డు మీదగా వెళ్లాలని తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారులైన కడప రింగ్ రోడ్డు నుండి చిత్తూర్ రింగ్ రోడ్డు వరకు అలాగే మదనపల్లి రింగ్ రోడ్డు వరకు రాయచోటి పట్టణంలో ఎలాంటి వాహనాలకు ప్రవేశం లేదని అలాగే రింగ్ రోడ్డులో ప్రయాణం చేస్తున్న వాహనాదారులకు ఎటువంటి ట్రాఫిక్ ఆంక్షలు లేవని తెలిపారు. ఉదయం 7 గంటల నుండి ఒంటిగంట వరకు ట్రాఫిక్ మళ్లింపు ఆంక్షలను వాహనదారులు ప్రజలు సహకరించాలని కోరారు.

మాట్లాడుతున్న ఎస్పి విద్యాసాగర్నాయుడు

ట్రిపుల్ఐటికి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె మోడల్ స్కూల్ నుంచి 2025-26 విద్యా సంవత్సరంలో ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ఐటికి ఎంపికైనట్టు ప్రిన్సిపల్ హేమంత్ కుమార్ తెలిపారు. జీ. నవీన్ కుమార్ రెడ్డి (నూజివీడు), ఎస్.వాహిద్ (ఆర్కెవ్యాలీ), ఎస్.పల్లవి (ఒంగోలు) సీట్లు సాధించినట్టు చెప్పారు. ఈ విద్యార్థులను ఎంఇఒలు త్యాగరాజు, నాగ సుబ్బారా యుడు, ఉపాధ్యాయులు అభినందించారు. **రామసముద్రం :**మండలం చెంబకూరు జడ్పి హైస్కూల్ విద్యార్థులు ఉప్పలపాటి కీర్తన, రెడ్డిపల్లి భువనేశ్వరిలు ఇడుపు లపాయ ట్రిపుల్ఐటికి ఎంపికయ్యారు. ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎల్ .మేఘన ఒంగోలు ట్రిపుల్ఐటికి ఎంపికైనట్లు హెచ్ఎం రమేష్ బాబు, ప్రిన్సిపల్ మునస్వామినాయక్ తెలిపారు.

భూసార పరీక్షతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు : భూసార పరీక్షతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారి సందీప్ పేర్కొన్నారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి అన్నదాత సుఖీభవ పథకం, సైడ్ టెస్టింగ్ ప్రాధాన్యత, నమూనాలు సేకరణ విధానం, బయో ఫర్టిలైజర్స్ ఎరువుల వాడకం, నేలల పున రుత్తేజానికి ఉపయోగాల, జీవ ఎరువులు వాడకంతో నేల ఆరోగ్యం మెరు గుపరచడం, దిగుబడుల పెరుగుదల తదితర అంశాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ హార్టికల్చర్ అసిస్టెంట్ ఉమ, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ సుధీర్, గ్రామ సర్పంచ్ కవిత, చంగల్రెడ్డి రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

క్రైం కార్నర్

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం గుర్రంకొండ మండలంలో చోటుచేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని చెర్లోపల్లి కి చెందిన ఆదినారాయణ కుమారుడు మణికంఠ కుటుంబ సమస్యలపై ఇంట్లో గొడవ పడ్డాడు. తల్లిదండ్రులు మందిలించడంతో తీవ్ర మనస్థాపానికి గురై, టమోటా చెట్లకు కొట్టేందుకు తెచ్చి ఇంట్లో ఉంచిన పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు బాధితుడిని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో వెలుగు చూసింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. వలసపల్లి గ్రామం అరవవాండ్లపల్లెకు చెందిన జి శివయ్య పుంగనూరు రోడ్డు, 150 మైలు వద్దకు నడచి వెళుతుండగా, గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో శివయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో బాధితుడిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పికోలు కుంటున్నాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

రెండు లారీలు ఢీ : డ్రైవర్ మృతి

- మరో డ్రైవర్కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని ఎపి మోడల్ స్కూల్ సమీపంలో బుధవారం రెండు లారీలు ఢీకొని రోడ్డు ప్రక్క గుంతలో పడిపోవడంతో ఒక లారీ డ్రైవర్ ఆబుబకర్ (40) మృతి చెందగా, మరో లారీ డ్రైవర్ ఆజర్ఖాన్ తీవ్ర గాయాల పాలైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాయచోటి వైపు నుంచి ఎరువులోడుతో కడప వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో రోడ్డు ప్రక్కగుంతలో పడిపోయాయని తెలిపారు. ఈ ప్రమాదంలో రెండు లారీల డ్రైవర్లకు త్రీవ గాయాలు కావడంతో రాయచోటి ఆస్పత్రికి తరలించగా అబుబకర్ అనే డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందా డని తెలిపారు. మరో లారీడైవర్ ఆజర్ఖాన్ తీవ్ర గాయాలతో చికిత్స పొందు తు న్నా డని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బంగారం చోరీ : కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

బంగారం చోరీ జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లి క్రాస్ వద్ద కె.హేమలత అనే మహిళ బేకరీ దుకాణంతో పాటు చిల్లర అంగడి నిర్వహిస్తున్నాదన్నారు. తన ఇంటిలో పెట్టినటువంటి 42 గ్రాములు గల బంగారం బొట్టు చైను, కమ్మలు, 250 గ్రాములు గల వెండి ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం దొంగలించారని గుర్తించినట్లు తెలిపారు. చోరీ జరిగిన విషయాన్ని పోలీస్ స్టేషన్లో బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.